క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి శిబిరం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల ఫసల్వాది గ్రామ శివారులోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో వేసవి శిబిరాలు కొనసాగుతున్నాయి. విద్యాపీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో 300 మంది పిల్లలకు ఆదివారం ఉత్సాహంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సంస్కృతిక, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. విద్యాపీఠం నిర్మిస్తున్న ఉమామహేశ్వర దేవాలయం విశిష్టత గురించి, స్టీల్, సిమెంట్ లేకుండా నిర్మించే విధానం, ప్రాముఖ్యతను వివరించారు.

మున్సిపల్ కార్యాలయం నిర్మించాలి

జోగిపేట(అందోల్): జోగిపేటలో మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని కౌన్సిలర్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేసినా ఇప్పటివరకు ఏలాంటి పనులను ప్రారంభించలేదన్నారు. అందోలు–జోగిపేట మున్సిపాలిటీగా ఏర్పడి పదేండ్లు గడిచిందన్నారు. రెండు పర్యాయాలు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా భవనం పనుల కోసం పలుమార్లు శంకుస్థాపనలు చేసినా పనులు మాత్రం చేపట్టలేకపోయారన్నారు. ప్రస్తుతం పాలకవర్గ సమావేశాలన్ని పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో నిర్వహించుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం స్పందించి జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి సీఎం అథ్లెటిక్ పోటీలకు టెక్నికల్ చీఫ్ కృష్ణకుమార్



కృష్ణకుమార్

వట్‌పల్లి(అందోల్): గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈనెల 29, 30వ తేదీలలో రాష్ట్ర స్థాయి చీఫ్ మినిస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు టెక్నికల్ అఫీషియల్ చీఫ్‌గా మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన కలపల్లి కృష్ణకుమార్ నియమితులైనట్లు తెలిపారు. కోచ్ వెంకటస్వామి, ఎంపీటీసీ నాగరాజు, గ్రామస్తులు కృష్ణకుమార్‌ను అభినందించారు.

42వ రోజుకు చేరిన వీఓఏల నిరవధిక సమ్మె



సమ్మె చేస్తున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని జోగిపేటలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారానికి 42వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వీఓఏలకు పదోన్నతి కల్పించాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలు, అభయహస్తం డబ్బులు చెల్లించాలని, సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమ్మె చేస్తున్నవారిలో వీఓఏల అధ్యక్షుడు మల్లయ్య, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్వచ్ఛంద సంస్థల ఆపన్న హస్తం



నారాయణఖేడ్: సరుకులు అందజేస్తున్న ఉదయ్ ఫౌండేషన్ బాధ్యులు

నారాయణఖేడ్: నిరుపేద కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు ఆపన్న హస్తాన్ని అందించాయి. నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు చెందిన దర్జి లక్ష్మి వారం కిందట అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త 20 ఏళ్ల కిందట మృతి చెందారు. ఉన్న ఏకైక కుమారుడు ఏడాది క్రితం మతిస్థిమితం తప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంత వరకు ఆచూకీ లేదు. దీంతో లక్ష్మి అత్త నర్సమ్మ అనాథగా మారింది. పూటగడవని దీనస్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న సిద్దిపేటకు చెందిన ఉదయ్ ఫౌండేషన్ చైర్మన్ నరేందర్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపగా ఫౌండేషన్ బాధ్యులు అంజాగౌడ్, విప్పల్కర్ నరేందర్, మున్వర్ ఖురేషి, ప్రవీణ్‌కుమార్, శేఖర్, శివాచారి, సుభాష్ ఆదివారం ఆమెకు అందజేశారు. అలాగే ఖేడ్‌లో నిరుపేద పుట్నాల లక్ష్మి కుటుంబానికి విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నర్వ మాణిక్యం, అంజాగౌడ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- బ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయ పునఃనిర్మాణం
- మూడు రోజులపాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన ఉత్సవాల నిర్వాహకులు



ముస్తాబైన భ్రమరాంభిక,మల్లికార్జున ఆలయం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని దేవునూర్ గ్రామంలో బ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయ పునఃనిర్మాణం, శివపంచాయతన ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 29వ తేదీన ప్రతిష్ఠ విగ్రహాల ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహ వాచనము, యాగశాల ప్రవేశం, జలాధి వాసం, 30న ఆవాహిత దేవతా పూజ, ధాన్యాది వాసము, ఫలపుష్పశయ్యా దివాసము, ప్రదోష పూజ, 31న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపన, బలి ప్రధానం, పూర్ణాహుతి, వేదాశీర్వాదము, సాయంత్ర పార్వతీ పరమేశ్వర శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఉత్సవాలకు బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహరాజ్, బీచ్కుంద మఠ పీఠాధిపతి సోమేశ్వర శివాచార్యులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

అనురాగం ఆత్మీయతలు పంచిన సమ్మేళనాలు

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



జోగిపేట(అందోల్): దశాబ్దాల బలమైన ఆకాంక్ష, ఎన్నో పోరాటాలు, ఎన్నో ఉద్యమాలు, ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకోబోతున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ మంచి దృక్పథంతో రూపొందించిన ఆత్మీయ సమ్మేళనాలు ప్రజలను పార్టీకి మరింత చేరువ చేయగా, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఇతర పార్టీలకు భిన్నంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కార్యకర్తలను నేతలను ఒక చోటకు చేర్చి వారి కష్టసుఖాలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు పార్టీ కార్యక్రమాలను వారికి వివరిస్తూ వారితో ఆత్మీయంగా గడిపిన క్షణాలు మర్చిపోలేనివన్నారు. ప్రతీ మండలంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాలు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజలకు ఉన్న అభిమానాన్ని తెలియజేసిందన్నారు. నియోజకవర్గంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి హరీశ్ రావు, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో పాల్గొన్నారన్నారు. అందోల్, పుల్కల్, రాయికోడ్, రెగోడ్ , చౌటకూర్, టేక్మాల్, అల్లాదుర్గం, మునిపల్లి, మండలాల సమ్మేళనాల్లో జనజాతరను తలపించిందన్నారు. వట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం ఎన్నికల ర్యాలీని తలపించిందని, ఈ ర్యాలీ ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టించిందన్నారు. పార్టీ కార్యకర్తలు ఎంతో ప్రేమగా గుర్రంపై ఎక్కించి ఊరేగింపుగా సభ స్థలానికి తీసుకుపోయారన్నారు. వట్‌పల్లి మండలం ఇప్పటికే ఏకపక్షంగా టీఆర్ఎస్ వెంటే ఉండగా అదే ఊపును ఆత్మీయ సమ్మేళనంలో సైతం కొనసాగించారు. ఒకటి రెండు ప్రాంతాల్లో ఇంకా అందరినీ కలుపుకు పోవాల్సిన అవసరం వుందని గుర్తించామన్నారు. ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి..

రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానకరం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం ఏరియా కార్యదర్శి యాదగిరి

కొండాపూర్(సంగారెడ్డి): నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్టపతిని పిలవకపోవడం అవమానకరమని సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. సంగారెడ్డిలో ఆదివారం సీపీఎం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ప్రారంభోత్సవంలో ప్రతిపక్షాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 19 పార్టీలు పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించినా భవనాన్ని ప్రారంభిండం ఎమిటని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వాన్ని వెనుక ఉండి నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం ఈ దేశాన్ని మత రాజ్యాంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నాయని, అందుకే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోలాగా దేశం నుంచి బీజేపీని తరిమేసే సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పంతులమ్మ, రాజేష్, మల్లేశం, వీరేశం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న శ్రీకాంత్ గౌడ్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం బీరంగూడ మండే మార్కెట్ వద్ద నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో నందమూరి యువసేన సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, భారతి నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుకర్ రెడ్డి, ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: ఎన్టీఆర్ శతజయంతిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఎంఆర్ఎఫ్ కార్మిక సంఘం సంఘం అధ్యక్షులు ఎంజీ రాములు సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవి కిరణ్, కార్మిక సంఘం నాయకులు కృష్ణ, మహమ్మద్ ఖలీద్, ఇస్మాయిల్, మాజీ సర్పంచ్ జగదీష్, యాదవ సంఘం నాయకుడు రాజా రమేష్ యాదవ్, టేకుమట్ల గణేష్ , లక్ష్మణ్ యాదవ్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శతజయంతిని ఆదివారం నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్థం విశ్వనాథం, బాలాగౌడ్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సమప్రాధాన్యం ఇచ్చిన సీఎం కేసీఆర్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ కుమార్

పటాన్‌చెరు టౌన్: అన్నివర్గాలకు సమప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని, పద్మశాలీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ కోకాపేటలో భవననిర్మాణానికి విలువైన 2.5 ఎకరాల భూమి కేటాయించడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ తో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, జనరల్ సెక్రటరీ నరేశ్ నారాయణ, దేవీ ప్రవీణ్, సత్యనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు ఏడాది పూర్తి



భజన చేస్తూ వెళ్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నగర సంకీర్తన ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పట్టణంలోని సుభాష్‌గంజ్, బాగారెడ్డి స్టేడియంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కీర్తనలు పాడుకుంటూ భజనలు చేస్తూ సుభాష్ గంజ్ ప్రాంతమంతా తిరిగారు. పట్టణంలోని ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారులు, ఇతర వర్గాల ప్రజలతో పాటు స్త్రీలు, పిల్లలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఏడాది క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

వనదుర్గా నమోస్తుతే...



పాపన్నపేట(మెదక్): ఎల్లలు దాటి తరలివచ్చిన భక్తులతో ఆదివారం ఏడుపాయల కిటకిటలాడింది. తెల్లవారుజామునే పూజారులు దుర్గమ్మను పట్టువస్త్రాలతో అలంకరించారు. అర్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీర నదిలో స్నానాలు చేసి అమ్మవారికి బోనాలు తీసి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బంధువులతో కలిసి విందు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చైర్మన్ బాలాగౌడ్, ఈఓ శ్రీనివాస్, ధర్మకర్తలు, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

మహాజన సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సుధీర్ కుమార్

జహీరాబాద్ టౌన్: బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మొగుడంపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు వీరారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లిలో నాలుగు రోజులుగా హరినామస్మరణ మారుమోగుతుంది. లక్ష్మీనారాయణ స్వామి ఆలయ 6వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీ వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో లక్ష్మీనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఎంపీపీ మనోజ్‌రెడ్డి, గారకుర్తి సర్పంచ్ హేమలత అరవింద్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వెంగళదాస్ ప్రభు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం రథోత్సవం జరిగింది. మహిళలు , చిన్నారుల కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు.

గాలి, వానతో ఇబ్బందులు



ఈదురు గాలులతో చెల్లా చెదురైన వస్తువులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. జిన్నారం శివారులోని అజిత్ అనే వ్యక్తి ఏర్పాటు చేసుకున్న షాపు ఈదురు గాలులతో ఎగిరిపోయింది. అందులోని వస్తువులు చెల్లాచెదురుగా పడ్డాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, తనను ఆదుకోవాలని అజిత్ విజ్ఞప్తి చేశాడు.



1995-96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని చింతలచెరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి 1995-96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాద పూజ చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బసవలింగప్ప, పెంటయ్య, మురళీధర్, వెంకటేశం, గంగారం, మాణయ్య, విద్యార్థులు జంగారి శ్రీనివాస్ గౌడ్, రాజు, దుర్గేశ్, సదానందం, నర్సింహాచారి, ప్రభావతి, రమాదేవి, శైలజ, విద్యార్థులు పాల్గొ న్నారు.

ముమ్మరంగా కొల్లూర్ పీఎస్ పనులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌కు నూతన పోలీస్‌స్టేషన్ మంజూరైన సంగతి తెలిసిందే. ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించకపోవడం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉస్మాన్‌నగర్‌లోని మున్సిపల్ వార్డు కార్యాలయం అవరణలోని భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. అందుకు సంబంధించిన పనులు జోరుగా సాగుతున్నాయి. జూన్ 5వ తేదీన పోలీస్‌స్టేషన్ ప్రారంభం కానుంది. కాగా ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌కు 50 మంది సిబ్బందిని కేటాయించింది. ప్రస్తుతం ఒక ఇన్‌స్పెక్టర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం బదిలీపై వచ్చిన లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ సంజయ్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎఫ్ఐఆర్ రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కొనసాగుతున్న ఆలయ పనులు**



జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం విశ్వకర్మ సంఘం నాయకులు భరత్‌చారి, విఠల్‌చారి తదితరులు పనులను పరిశీలించారు. దాతల సహకారంతో వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడలో నిర్వహించనున్న గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనకు చిటుకల్ సర్పంచ్ నీలం మధు రూ.1.50 లక్షల విరాళాన్ని ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు నీలం మధుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా**

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డీనేటర్‌గా మండల పరిధిలోని మేడికుందా గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ నియమితులైన సందర్భంగా ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కచూర్‌రావు, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, మాజీ సర్పంచ్ మొగులయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **సామూహిక ప్రార్థన**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో ఆదివారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వగురువు బసవేశ్వరుడి పాలరాతి విగ్రహానికి ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం, సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు బసవేశ్వరుడి బోధనలు వినిపించారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్, అక్కన బళగ నాయకులు పాల్గొన్నారు.

◆ **వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన**

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై మహిళా అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణా తెలిపారు. పరిశుభ్ర ఆరోగ్య రక్షణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉంటే అనేక వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. మహిళా సంఘాలు ప్రజలను చైతన్యవంతులను చేయ్యాలన్నారు. కార్యక్రమంలో మీనా, సిద్దమ్మ, సీసీలు సంగన్న, రాములు, నాగమణి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో జూన్ 2 నుంచి 4వ తేదీ వరకు జై బజరంగ్‌బళి కబడ్డీ టీమ్ ఆధ్వర్యంలో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ జరగనుంది. నిర్వహణకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్ యాదవ్, దినేష్ గౌడ్, ఆనంద్, పాండు, శంకర్, లడ్డు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

◆ **మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ**

సంగారెడ్డి మున్సిపాలిటీ: మున్సిపల్ కార్మికులకు వాసవి మాఇల్లు ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి మా ఇల్లు అధ్యక్షుడు తొపాజి అనంత కిషన్ మాట్లాడుతు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు ఎంత చేసినా తక్కువే అన్నారు. కార్యక్రమంలో వాసవి మా ఇల్లు సభ్యులర, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు .

రేపు దివ్యాంగుల బస్సుపాసు మేళా

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 30వ తేదీన బస్సుపాసు మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు ఆదివరం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు డీఎం మల్లేశయ్య ఆధ్వర్యంలో మేళా జరుగుతుందున్నారు. బస్సుపాసుల కోసం ఖేడ్ డిపో పరిధిలోని గ్రామాల దివ్యాంగులు తమ సదరం ధృవపత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజు ఫొటో, రూ.50 తీసుకొని రావాలని సూచించారు. రాలేనివారు ఎవరినైనా పంపించవచ్చన్నారు. వివరాల కోసం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరు ప్రవీణ్‌కుమార్‌ను 94940 93486, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండును 94410 71134, 73828 30800 నంబర్లలో సంప్రదించాలన్నారు.